క్లుప్తంగా

కుంకుడు ఆకుపై కవి చక్రవర్తి



పొదలకూరు : కుంకుడు ఆకుపై కవి చక్రవర్తిగా పేరొందిన గుర్రం జాషువ చిత్రాన్ని ఆయన వర్ధంతి సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య బుధవారం రూపొందించారు. జాషువ రచనలంటే ఇష్టపడే పెంచలయ్య ఆయనకు తన కళ ద్వారా నివాళులర్పించారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని మల్లూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఏఓ జ్యోత్స్నరాణి ఆధ్వర్యంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయశాఖ 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్నట్టు తెలిపారు. రైతులు ఆధునిక వ్యవసాయం వైపు మొగ్గు చూపాల్సిందిగా పేర్కొన్నారు. 80 శాతం రాయితీతో డ్రోన్లను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మల్లికార్జున్‌యాదవ్, ఏఈఓ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



కొడవలూరు: మండలంలోని మిక్కిలింపేట ప్రాథమిక పాఠశాలలో ఎనిమిదేళ్ల పాటు ఉపాధ్యాయుడిగా పనిచేసి బదిలీపై వెళ్లిన పి.తిరుపాలును ఆ పాఠశాలలో సర్పంచ్ కోడూరు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎంతో చిత్తశుద్ధి కనబరిచి విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల మన్ననలు పొందిన ఉపాధ్యాయుడు బదిలీ కావడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉప్పు మహేష్, హెచ్ఎం కె.వెంకటేశ్వర్లు, స్థానిక నాయకుడు కోడూరు సుధాకర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ పల్లం విజయలక్ష్మి, సీఆర్ఎంటీ ఎం.దయాకర్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు గౌస్‌బాషా, అంగన్‌వాడీ కార్యకర్త పి.కామేశ్వరి పాల్గొన్నారు.

జెడ్పీహెచ్ఎస్‌లో కంటి వైద్య శిబిరం

కోవూరు: కోవూరులోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగిన కంటి వైద్య శిబిరం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా హెచ్ఎం సోఫియా కిరణ్మయి మాట్లాడుతూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో 700 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 46 మందికి కంటి అద్దాలు అవసరమని ఆప్తమాలజిస్టులు గుర్తించారన్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉచితంగా కంటి అద్దాలను త్వరలో అందిస్తారని వివరించారు. కార్యక్రమంలో ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ ఇలియాజ్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కోవూరు: ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై రంగనాథ్‌గౌడ్ కోరారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై పట్టణంలోని టీఎన్సీ ప్రభుత్వ కళాశాలలో, జేబీఆర్ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ.. ఆరోగ్యకరంగా జీవించాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా తదితర సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1972కు ఫిర్యాదు చేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు నోటీసులు

కోవూరు: ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఫిర్యాదు మేరకు కోవూరు వైఎస్సార్‌సీపీ నాయకులకు ఎస్సై రంగనాథ్‌గౌడ్ బుధవారం అర్ధరాత్రి 11 గంటల సమయంలో నోటీసులు జారీ చేశారు. పార్టీ మండల కన్వీనర్ అత్తిపల్లి అనూప్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, రైతు విభాగం నాయకుడు హరిప్రసాద్‌రెడ్డిలను 26న విచారణకు హాజరుకావాలని నోటీస్ అందించారు.

ఉపాధి కూలీల ఆకలి కేకలు

- పది వారాలుగా అందని కూలి నగదు
- మండలంలో రూ.1.34 కోట్ల మేర బకాయిలు
- అనేక గ్రామాల్లో ఉపాధి పనుల బహిష్కరణ

వలస కూలీల నివారణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేదలను ఆదుకోలేకపోతోంది. కూలీలకు వంద రోజుల పని కల్పించలేక ఓ వైపు, పనిచేసిన వారికి సకాలంలో వేతనాలు చెల్లించలేక మరో వైపు ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకంపై కూలీలు అసహనం వ్యక్తం చేస్తూ పనులను బహిష్కరించాల్సి వస్తోంది.



మండపం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు

తోటపల్లిగూడూరు: మండలంలో 22 పంచాయతీలకు సంబంధించి 8,549 కుటుంబాలకు జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో కేవలం 2,696 కుటుంబాలు మాత్రమే ప్రస్తుతం పనులను వినియోగించుకొంటున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మండల పరిధిలోని చిన్నచెరుకూరు, ముంగళదొరువు, మండపం, ఈదూరు, వరిగొండ, మల్లికార్జునపురం, వరకవిపూడి, పాపిరెడ్డిపాళెం, ఇస్కపాళెం, తోటపల్లి, మాచర్లవారిపాళెం గ్రామాల్లో ప్రస్తుతం ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి.

రెండున్నర నెలలుగా నిలిచిన కూలీ నగదు

ఉపాధి హామీ పథకం కింద పనులు జరుగుతున్న ఆయా గ్రామాల్లోని కూలీలకు గత రెండున్నర నెలలుగా వేతనాలు రావాల్సి ఉంది. ఈ ఏడాది మే రెండో వారం నుంచి ఈనెల మూడో వారం వరకు అంటే పది వారాల పాటు పనిచేసిన కూలీలకు వేతనాలు అందాల్సి ఉంది. అంటే 48 వేల కూలీ దినాలకు గానూ దాదాపు రూ.1,34,40,000ల వరకు కూలీలకు వేతనాలు అందాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. ఏ పూటకు ఆ పూట పనులు చేసుకుని జీవించే పేదలు ఇన్నేసి వారాల తరబడి వేతనాలు అందకపోతుండడంతో కూలీలు పస్తులతో గడపాల్సి వస్తోంది. గతంలో వారం మార్చి వారం కూలీలకు వేతనాలు అందుతుండేవి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ విధానానికి స్వస్తి పలికి మూడు, నాలుగు వారాలకు కూలి మొత్తాలను అందిస్తోంది. అయితే ప్రస్తుతం ఏకంగా రెండున్నర నెల అంటే 10 వారాల పాటు వేతనాలకు బ్రేక్ పడిపోయాయి. ఈ పరిస్థితిలో పనులు చేసిన కూలీలు ఆకలి దప్పికలతో అలమటించాల్సి వస్తోంది. ఈ క్రమంలో నిరాశలో కూరుకుపోతున్న పేదలు ఉపాధిహామీ పనులపై ఆసక్తి చూపలేకపోతున్నారు. దీంతో అనేక గ్రామాల్లో కూలీలు పనులను బహిష్కరిస్తుండడంతో ఉపాధిహామీ పనులను పూర్తిస్థాయిలో చేపట్టలేక అధికారులు సతమతమవుతున్నారు.

ఉపాధిహామీపై నమ్మకం పోతోంది



ఉపాధి హామీ కింద పనిచేసిన కూలీలకు గతంలో వారం మార్చి వారం కూలి నగదు అందేది. అయితే ప్రస్తుతం రెండు నెలల నుంచి మూడు నెలల సమయం పడుతోంది. ఏ పూట కాపూట కూలి చేసుకుని జీవించే పేదలకు ఇంతంత కాలం నగదు అందకపోతే ఎలా? ఈ పరిస్థితిల్లో ఉపాధిహామీ పథకంపై పేదలు నమ్మకాన్ని కోల్పోవాల్సి వస్తోంది.

– పచ్చా మధు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు

నిధులు రాగానే జమ చేస్తాం



మండలంలో ప్రస్తుతం 13 గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు జరుగుతున్నాయి. వేతనాలకు సంబంధించి ఈ ఏడాది మే మొదటి వారం వరకు కూలీలకు నగదు పంపిణీ జరిగింది. మే రెండో వారం నుంచి కూలీలకు వేతనాలు అందించాల్సి ఉంది. మా వైపు నుంచి కూలీల వేతనాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో రికార్డు చేసి ఉన్నతాధికారులకు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే కూలీ నగదును వారి వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తాం.

– వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ, తోటపల్లిగూడూరు

మండలంలో ఈ-క్రాప్ బుకింగ్

పొదలకూరు: మండలంలో ఖరీఫ్ సీజన్ పంటకు సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్ జరుగుతున్నట్లు ఏఈ ప్రతాప్ బుధవారం తెలిపారు. రైతులు విధిగా పంటల నమోదు చేయించుకోవాల్సిందిగా సూచించారు. రైతు సేవా కేంద్రంలో ముందుగా రైతుకు సంబంధించి ఆధార్, పాసు పుస్తకాలను ఆన్‌లైన్ చేస్తారన్నారు. తర్వాత వీఏఏలు క్షేత్రస్థాయిలో పంటలను నమోదు చేస్తారన్నారు. ఈ-క్రాప్ బుకింగ్ వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నట్టు వెల్లడించారు. పండించిన పంటను గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలన్నా, విపత్తుల సమయంలో పరిహారం అందజేసేందుకు, అన్నదాత సుఖీభవ తదితర పథకాల అమలుకు ఉపయోగపడుతుందన్నారు.

పరీక్ష కేంద్రంలో వీసీ తనిఖీ



వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో పరీక్ష కేంద్రాన్ని వీసీ అల్లం శ్రీనివాసరావు బుధవారం తనిఖీ చేశారు. వీఎస్‌యూలోని పరీక్ష కేంద్రంలో పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో వీసీ పరీక్షా కేంద్రానికి వెళ్లి విద్యార్థుల హాల్ టికెట్‌లను పరిశీలించి, వసతుల గురించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూడాలని ఛీఫ్ సూపరింటెండెంట్ సీహెచ్ విజయకు సూచించారు.

ప్రసన్నకు మైపాడు నేతల పరామర్శ



ప్రసన్నకుమార్‌రెడ్డితో మైపాడు నాయకులు

ఇందుకూరుపేట: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై పచ్చమూకలు దాడి చేసి పైశాచికానందాన్ని పొందాయి. ఈ దారుణాన్ని తట్టుకోలేని కోవూరు నియోజకవర్గ ప్రజలు ఆయన్ను పరామర్శించేందుకు భారీగా తరలి వస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని మైపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు నెల్లూరులోని ప్రసన్న నివాసంలో బుధవారం కలిసి పరామర్శించారు. టీడీపీ గూండాల దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ పార్టీ నేతలు సమష్టిగా ఉండాలని, కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మైపాడు సర్పంచ్ సంగం వెంకయ్య, పార్టీ నాయకులు నరేష్, విజయ్, శివ, వెంకటేష్, ప్రతాప్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కలకలం

- వసతిగృహంలోనే ఉన్న విద్యార్థిని

కొడవలూరు(బుచ్చిరెడ్డిపాళెం): గురుకులంలోని తరగతి గదిలో బాలిక కనిపించకపోవడంతో కలకలం రేగింది. ఆందోళనకు లోనైన గురుకులం ప్రిన్సిపల్ హడావుడిగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఆ బాలిక వసతిగృహంలోనే ఉండడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటన మండలంలోని రామచంద్రాపురం గురుకుల పాఠశాలలో బుధవారం చోటుచేసుకొంది. ఇక్కడి గురుకులంలో ఇంటర్ చదివే బాలిక తండ్రిని చూడాలని కబురు పంపారు. కానీ తండ్రికి తీరిక లేకపోవడంతో సోమవారం కూడా గురుకులానికి రాలేకపోయారు. దీంతో మనస్తాపం చెందిన ఆ బాలిక బుధవారం గురుకులంలోని తరగతి గదికి వెళ్లలేదు. దీంతో బాలిక కనిపించకపోవడంతో ఆందోళనకు లోనైన ఉపాధ్యాయులు ప్రిన్సిపల్ వసుధకు సమాచారం అందించారు. ఆమె హుటాహుటిన పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. తరువాత తిరిగ్గా గురుకులంలోని బాలికల వసతి గదుల్లో పరిశీలించగా మనస్తాపానికి లోనై అక్కడే ఉండిపోయినట్లు గుర్తించారు. దీంతో రెండు గంటలపాటు సాగిన ఉత్కంఠకు తెర పడింది.

సౌత్ జోన్ పోటీలకు 'అక్షర' విద్యార్థులు

వెంకటాచలం: తమిళనాడు రాష్ట్రం కారైకుడిలోని చెట్టినాడు పబ్లిక్ స్కూల్‌లో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు జరిగే సౌత్ జోన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు వెంకటాచలం మండలం సరస్వతీనగర్‌లోని అక్షర విద్యాలయ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ క్రమంలో ఎంపికైన నిశాంత్, ప్రదీప్, ఈషిత్ నాయన్, అబ్దుల్ కలామ్‌లను అక్షర విద్యాలయ డైరెక్టర్ కుముద, కోచ్ సుమన్ బుధవారం పాఠశాలలో అభినందించారు. సౌత్‌జోన్ చెస్ పోటీల్లో ప్రతిభ చూపి ఉదయ్‌పూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.



ఎంపికైన విద్యార్థులతో అక్షర విద్యాలయ డైరెక్టర్, కోచ్

డెంగీపై అప్రమత్తత అవసరం

కొడవలూరు: డెంగీపై ప్రతిఒక్కరికీ అప్రమత్తత అవసరమని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.బాలచంద్రబాబు సూచించారు. మండలంలోని రామన్నపాళెం పాతూరులో ఇంటింటికీ వెళ్లి దోమల ఆవాసాలను తొలగించి డెంగీపై బుధవారం అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలో మంచి నీరు, వర్షపు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. తొట్టెలలో నీరు నిల్వ ఉంటే డెంగీకి కారణమైన ఎడిస్ దోమ ఉత్పత్తవుతుందన్నారు. డెంగీ ప్రాణాంతక వ్యాధి అయినందున ప్రతిఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అదేవిధంగా ఇంటి పరిసరాల్లో మురికి నీటి నిల్వలు, చెత్తా చెదారాలు రోజుల తరబడి పేరుకుపోయి ఉంటే మలేరియా, డయేరియా లాంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎస్ వి.రామ్మోహన్, హెచ్ఏ షఫీ ఉద్దీన్, ఎంఎల్‌హెచ్‌పీ మాబ్‌జానీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



డ్రమ్ముల్లో నిల్వ నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

పెనుబల్లి మీదుగా నెల్లూరుకు ఆర్టీసీ బస్సు

కొడవలూరు(బుచ్చిరెడ్డిపాళెం): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ నుంచి పెనుబల్లి మీదుగా నెల్లూరుకు ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేశారు. దీనిని పెనుబల్లి గ్రామంలో ఆత్మకూరు డిపో మేనేజర్ శివకేశవ్ యాదవ్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెనుబల్లి ఎంపీటీసీ సభ్యుడు వినయ్ నారాయణ మాట్లాడుతూ ఈ బస్సు వల్ల సాల్మన్‌పురం, కాగులపాడు, జొన్నవాడ, బాపనపాడు, కొండ్లపూడిల నుంచి పెనుబల్లి ఉన్నత పాఠశాలకు వచ్చే విద్యార్థులకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. అదేవిధంగా జొన్నవాడ పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు, నెల్లూరుకు నిత్యం వెళ్లే చిరుద్యోగులకు ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అనంతకృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ గోపి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



పెనుబల్లిలో ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న అధికారులు

పారిశుద్ధ్య పనుల్లో జాప్యం వద్దు

కోవూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనుల్లో జాప్యం వహించవద్దని ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి సూచించారు. మండలంలోని పోతిరెడ్డిపాళెం గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన బుధవారం ఉదయం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉండటానికి ప్రతిఒక్కరి సహకారం కీలకమన్నారు. ప్రజలు తమ ఇంటి వద్దకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. దీనివల్ల చెత్త నుంచి సంపద కేంద్రాల్లో ఉత్పత్తి అయ్యే ఎరువులు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతిఒక్కరూ స్వచ్ఛతలో భాగస్వాములు కావాలని కోరారు.



చెత్త తరలింపు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కాకాణి పూజిత పరామర్శ



వేణురెడ్డిని పరామర్శిస్తున్న పూజిత

పొదలకూరు: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత పొదలకూరులోని అయ్యగారిపాళెంలో పార్టీ నాయకుడు వేణురెడ్డిని బుధవారం పరామర్శించారు. ఆయన సోదరి హైమావతమ్మ దశదిన కర్మలో పాల్గొని, నివాళులర్పించారు. అలాగే వెంకటాచలం మండలం పూడిపర్తి గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు కోడూరు మనోహర్‌రెడ్డి తండ్రి చంద్రశేఖర్‌రెడ్డి దశదిన కర్మను నెల్లూరులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజిత పాల్గొని, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

కొడవలూరు: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల్లో కొందరి ఆధార్ బ్యాంక్ ఖాతాకు లింక్ కాలేదని, అలాంటి వారు వీఏఏను సంప్రదించి తప్పనిసరిగా చేసుకోవాలని ఏఓ ఎస్.విజయలక్ష్మి సూచించారు. మండలంలోని తలమంచి, దామేగుంటల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రైతు సేవా కేంద్రాల్లో 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు ఇస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకుని నేలను సారవంతం చేసుకోవాలన్నారు. భూమిని కౌలుకు సాగు చేసే రైతులు వీఆర్వోను సంప్రదించి కౌలు కార్డులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ పి.వెంకట్రావు, వీఏఏ నవీన్, రైతులు పాల్గొన్నారు.



కొడవలూరు: దామేగుంటలో..

⇨ కోవూరు: మండలంలోని గుమ్మళ్లదిబ్బ, పాటూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏఓ రజని పాల్గొని, రైతులకు పలు సూచనలు చేశారు. ముందుగా రైతులు వేసే ప్రతి పంటను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, దీని కోసం రైతులు తమ పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డు వంటి పత్రాలను తీసుకెళ్లి వీఏఏలకు అందజేయాలని తెలిపారు. పంటల నమోదు ద్వారా వివిధ రకాల సబ్సిడీలు, పంట బీమా సదుపాయాలు, ఇతర ప్రయోజనాలు లభిస్తాయని వివరించారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలని, ఎకరాకు గరిష్ఠంగా రెండు క్వింటాళ్ల (దాదాపు రెండు బస్తాలు) మాత్రమే వాడాలని సూచించారు. అనంతరం మట్టి పరీక్షల ప్రాధాన్యం, సేంద్రియ ఎరువుల ఉపయోగం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో దిగుబడుల పెంపుపై అవగాహన కల్పించారు.

⇨ విడవలూరు: వేరుశనగ పంటపై రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మి అన్నారు. మండలంలోని ఊటుకూరు, రామతీర్థం, గౌరీపురం గ్రామాల్లోని వేరుశనగ రైతులకు బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పొదలకూరు వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి విచ్చేసిన శాస్త్రవేత్తలు ప్రసన్న రాజేష్, సురేఖ, హసీమా పాల్గొని, మాట్లాడారు. వేరుశనగలో లద్దె పురుగు బెడద ఎక్కువగా ఉంటోందని, అవి సోకకుండా రైతులు స్థానిక రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించి, నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కోవూరు ఏడీఏ జి.అనిత వేరుశనగ పంటలకు ఎస్ఎంఈఓ క్లస్టర్ డెమో స్కీమ్ కింద అమలవుతున్న సబ్సిడీ వివరాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి గీతాకుమారి, వీఏఏలు ప్రవీణ్, చెంచులక్ష్మి, ప్రత్యూష పాల్గొన్నారు.

⇨ మనుబోలు: రైతు సేవా కేంద్రాల ద్వారా 50 శాతం సబ్సిడీతో రైతులకు పచ్చరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నామని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య తెలిపారు. మండలంలోని కొలనకుదురు, బద్దెవోలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చరొట్ట విత్తనాలు అవసరమైన రైతులు పాసు పుస్తకాలతో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. రైతులు తమ పొలాల్లో జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చరొట్ట పంటలు సాగు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. రైతులు పొలాల్లో భూసార పరీక్షలు జరిపించుకుని భూమి స్వభావానికి అనుకూలమైన పంటలను సాగు చేయాలని సూచించారు. యూరియా ఎక్కువగా వాడడం వల్ల వరిలో పురుగులు, తెగుళ్లు ఎక్కువ అయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో వీఏఏలు సౌంధర్య, సుధ తదితరులు పాల్గొన్నారు



కోవూరులో రైతులకు అవగాహన



విడవలూరు: పొలాలను పరిశీలిస్తున్న అధికారులు



మనుబోలు: మాట్లాడుతున్న ఏవో వెంకటకృష్ణయ్య